# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 2 సంచిక : 306 శుక్రవారం 28 జూన్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను




## ముఖ్యమంత్రి కావాలనే నా ఆకాంక్ష నెరవేరింది

- కేసీఆర్‌ను గద్దె దించాలనే జీవిత లక్ష్యం నెరవేరిందన్న సీఎం
- ఇక తన ముందు ఉన్నది... తెలంగాణ పునర్నిర్మాణమేనని వ్యాఖ్య
- పీసీసీ పదవీ కాలం ముగిసిందన్న రేవంత్ రెడ్డి
- ఎవరికి బాధ్యతలు అప్పగించినా కలిసి పని చేస్తానని స్పష్టీకరణ
- తన హయాంలోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్న సీఎం
- ఒంటె పెదాల కోసం కాసుక్కూచున్న గుంట నక్కలు..
- ఎట్టకేలకు జీవన్‌రెడ్డి అంశంపై పెదవి విప్పిన రేవంత్‌రెడ్డి
- జీవన్‌రెడ్డి మనస్తాపం చెందడంలో అర్థం ఉందన్న రేవంత్‌రెడ్డి
- శ్రీధర్‌బాబు చొరవతో సమస్య పరిష్కారమైందని కితాబు
- ఫిరాయింపులకు పునాది వేసిందే కేసీఆర్ అని ఆగ్రహం

# సగం మందికే పెట్టుబడి







- మారుతున్న రైతు భరోసా రూల్స్...
- గత ప్రభుత్వంలా కాకుండా ఈసారి అర్హులకే రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ అందించింది.
- రైతుభరోసా అందించేందుకు ప్రభుత్వం గ్రామాల వారీగా సాగుభూమి వివరాలు సేకరిస్తోంది

హైదరాబాద్

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఖరీఫ్ సాగు మొదలైంది. పెట్టుబడి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే గత ప్రభుత్వంలా కాకుండా ఈసారి అర్హులకే రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈమేరకు మార్గదర్శకాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు..ప్రభుత్వం ప్రవేశపెట్టే - మిగతా3లో

# జూలై 4న కేబినెట్ విస్తరణ



- ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను కలుస్తూనే.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో మార్పులు చేర్పులపై అధిష్టానంతో చర్చ
- తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ వేగవంతమైంది
- అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సమాచారం
- దీంతో మంత్రి పదవుల కోసం సీనియర్లు ప్రయత్నాలు ముమ్మరం

హైదరాబాద్

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైందా అంటే అవుననే అంటున్నారు కాంగ్రెస్ నేతలు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను కలుస్తూనే.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో మార్పులు చేర్పులపై అధిష్టానంతో చర్చిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీతో సమావేశమైన రేవంత్‌రెడ్డి నూతన టీపీసీసీ అధ్యక్షుడి ఎంపిక, రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణపై చర్చించినట్లు తెలుస్తోంది. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ వేగవంతమైంది. రాష్ట్రంలో 18 మంది మంత్రులకు అవకాశం ఉండగా ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డితోపాటు 11 మంది - మిగతా3లో



## ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది

- సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు
- బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్
- 'తెలంగాణ సాధించేనాటికి మనది సమైక్యపాలనలో దిక్కు మొక్కు లేని పరిస్థితి
- సాగునీరు తాగునీరు కరెంటు వంటి అనేక కీలక వసతులను కల్పించుకున్నాం. తీర్చిదిద్దుకున్నాం
- పదేండ్ల అనతికాలంలోనే తెలంగాణలో అద్భుతమైన ప్రగతిని సాధించుకున్నాం

## ఆ పనిచేస్తే సహించేది లేదు



- ప్రజాస్వామ్యాన్ని కించపరిచే ప్రతి ప్రయత్నాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి
- దేశ ఖ్యాతిని దిగజార్చేలా ఎవరూ వ్యవహరించకూడదు
- గత పదేళ్లలో తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది
- ప్రస్తుతం మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నాం
- 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ కింద ఉచిత ఆరోగ్య సేవలు అందిస్తాం
- రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

# దూకుడు... ప్లస్సా... మైనస్సా



- దూకుడు రాజకీయాలు కొన్నిసార్లు ప్రత్యర్థుల మైండ్ బ్లాంక్ చేస్తాయి
- సీఎం రేవంత్ రెడ్డి అంటే ఓ దూకుడు స్వభావం ఉన్న రాజకీయ నేత
- ఆ స్వభావమే రేవంత్ రెడ్డిని సీఎం పీఠం ఎక్కించింది
- పతిపక్షంలో ఉన్న దూకుడు స్వభావమే ఇప్పుడు రేవంత్ రెడ్డిని దెబ్బ తీస్తోందా అంటే అవుననే చెప్పాలి

హైదరాబాద్

దూకుడు కొన్నిసార్లు సక్సెస్ ఫార్ములా అవుతుంది. మరికొన్ని సార్లు పెద్ద దెబ్బే తగిలేలా చేస్తోంది. రాజకీయ రంగంలో కూడా అంతే. దూకుడు రాజకీయాలు కొన్నిసార్లు ప్రత్యర్థుల మైండ్ బ్లాంక్ చేస్తాయి. కొన్ని సార్లు ఆ దూకుడు నిర్ణయాలే ప్రత్యర్థులకు అస్త్రాలుగా మారతాయి. ఇక తెలంగాణ పాలిటిక్స్ విషయాలకు వస్తే.. సీఎం రేవంత్ రెడ్డి అంటే ఓ దూకుడు స్వభావం ఉన్న రాజకీయ నేత. ఆ స్వభావమే రేవంత్ రెడ్డిని సీఎం పీఠం ఎక్కించింది.ప్రతిపక్షంలో ఏ పార్టీ అయినా, లేదా పొలిటికల్ లీడర్ అయినా దూకుడుగా ప్రభుత్వం మీదకి వెళ్లడం వల్లే ప్రజల్లో ఓ ఇమేజ్ బిల్డ్ అవుతుంది. కాని అధికారం పక్షంలో ఉన్న వారికి మాత్రం చట్టం, నిబంధనలు, ప్రజల మూడ్ వంటివి ఆ దూకుడుకు ప్రతిబంధకాలు. ఆచి తూచి నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి అధికారంలో ఉన్న వారిది. అయితే ప్రతిపక్షంలో చేసినట్లే ఇప్పుడు పాలనాపరంగాను, రాజకీయంగాను చేస్తే మాత్రం ఎదురు దెబ్బలు తప్పవు. ప్రతిపక్షంలో ఉన్న దూకుడు స్వభావమే ఇప్పుడు రేవంత్ రెడ్డిని దెబ్బ తీస్తోందా అంటే అవుననే చెప్పాలి. అందుకు రెండు ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఒకటి పాలన పరమైనది, అయితే - మిగతా3లో



## రష్యాలో పట్టాలు తప్పిన రైలు..

- నదిలో పడ్డ బోగీలు..
- 70 మంది ప్రయాణికులకు గాయాలు
- కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్
- పలువురి పరిస్థితి సీరియస్ గా ఉందన్న వైద్యులు

# ఆ పనిచేస్తే సహించేది లేదు

దేశాభివృద్ధి ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆకాంక్షించారు.. 18వ లోక్‌సభ తొలి సమావేశాల నాలుగోరోజు ఆమె పార్లమెంట్ ఉభయసభల నుద్దేశించి మాట్లాడారు. గత పదేళ్లలో కేంద్రప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు.. రానున్న ఐదేళ్లలో ప్రభుత్వ ప్రాధాన్యతలను ఆమె తన ప్రసంగంలో వివరించారు. ప్రకారం శరణార్థులకు ప్రభుత్వం పౌరసత్వం మంజూరు చేయడం ప్రారంభించిందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కించపరిచే ప్రతి ప్రయత్నాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దేశ ఖ్యాతిని దిగజార్చేలా ఎవరూ వ్యవహరించకూడదన్నారు.



**ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చాం..**

గత పదేళ్లలో తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నామన్నారు. 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ కింద ఉచిత ఆరోగ్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. గతంలో తీసుకొచ్చిన ఎన్నో సంస్కరణలతో దేశంలో ఎన్నో మార్పులు తీసుకురాగలిగామని చెప్పారు. జీఎస్టీ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యం, వ్యాపార కార్యకలాపాలు సులభతరమయ్యాయన్నారు.

**సుస్థిరతకు పట్టం..**

దేశ ప్రజలు సుస్థిరతకు పట్టం కట్టారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సుస్థిరత, నిజాయతీని నమ్మారని అన్నారు. పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని తెలిపారు. రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ ఆధారంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. పంటలకు మద్దతు ధరకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకువచ్చామని.. ప్రజాక్షేమం కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నామని.. రైతుల సంక్షేమం కోసం అతి పెద్ద నెట్‌వర్క్ ఏర్పాటు చేసినట్లు రాష్ట్రపతి పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో అడవుల విస్తరణ ఉంటుందన్నారు. ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌తో దేశ ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తున్నామని, చిన్నరైతులకు పీఎం సమ్మాన్ నిధి ఏర్పాటు చేసినట్లు రాష్ట్రపతి తన ప్రసంగంలో పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని, పెట్టుబడులు, ఉపాధికల్పనకు అధిక ప్రాధాన్యమిచ్చామన్నారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలను ప్రజలు విశ్వసించారని.. ఆర్గానిక్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగిందని రాష్ట్రపతి తెలిపారు. ప్రపంచవ్యాప్త డిమాండ్ మేరకు భారత్ ఉత్పత్తులు అందిస్తోందన్నారు. ఆరోగ్య రంగంలో భారత్ అగ్రగామిగా ఉందని తెలిపారు. తమ దేశం వేగంగా పురోగతి సాధిస్తోందన్నారు.

# పిల్లలను నదిలో ముంచిన తల్లి.. ఇద్దరు మృతి, ఒకరు మిస్సింగ్



**లక్నో:** ఒక తల్లి దారుణానికి పాల్పడింది. నలుగురు పిల్లలను నదిలో ముంచింది. ఇద్దరు కుమారులు మరణించగా ఒక పిల్లవాడు అదృశ్యమయ్యాడు. మరో కుమారుడు ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే పిల్లలు ఆకలితో ఏడ్వడాన్ని చూడలేకనే వారిని నదిలో ముంచి చంపినట్లు ఆ మహిళ పోలీసులకు చెప్పింది. ఉత్తరప్రదేశ్‌లోని ఔరయ్యా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బరావా గ్రామానికి చెందిన ప్రియాంకకు నలుగురు పిల్లలు. ఏడాదిన్నర కిందట ఆమె భర్త చనిపోయాడు. నాటి నుంచి బంధువు ఇంట్లో ఆమె నివసిస్తున్నది. కాగా, గురువారం ఉదయం ప్రియాంక తన నలుగురు పిల్లలను కేశంపూర్ ఘాట్ వద్దకు తీసుకెళ్లింది. బాంబా నదిలో వారిని ముంచింది. నాలుగు, ఐదేళ్ల వయస్సున్న ఇద్దరు కుమారులు ప్రాణాలు కోల్పోయారు. ఏడాదిన్నర వయస్సున్న చిన్నారి కనిపించడం లేదు. అయితే ఆరేళ్ల వయస్సున్న పెద్ద పిల్లవాడు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. మరోవైపు ఈ విషయం తెలిసిన పోలీసులు ఆ ఘాట్ వద్దకు చేరుకున్నారు. నదిలో మునిగి మరణించిన ఇద్దరు పిల్లల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రియాంకను అరెస్ట్ చేశారు. ఆమెను ప్రశ్నించగా పిల్లలను తానే చంపినట్లు ఒప్పుకున్నది. వారు ఆకలితో ఏడుస్తుంటే తట్టుకోలేక ఇలా చేసినట్లు చెప్పింది. ఇది విన్న పోలీసులు షాక్ అయ్యారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డీకే శివకుమార్‌ను సీఎంను చేయండి

**సిద్ధరామయ్య ముందే మఠాధిపతి ప్రకటన**

**డిప్యూటీ సీఎం శివకుమార్ కూడా వక్కలింగ కులానికి చెందిన వ్యక్తే.**



**బెంగుళూరు:** కర్నాటకలో సీఎంకుర్చీపై వివాదం చెలరేగుతున్నది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను సీఎం చేయాలని, ఆ పదవిలో ఉన్న సిద్దరామయ్య తప్పుకోవాలని.. ఇవాళ వక్కలింగ వర్గానికి చెందిన ప్రముఖ మఠాధిపతి కుమార చంద్రశేఖరనాథ స్వామి అభిప్రాయపడ్డారు. బెంగుళూరు వ్యవస్థాపకుడు కెంపెగౌడ 515వ జయంతి ఉత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. డిప్యూటీ సీఎం శివకుమార్ కూడా వక్కలింగ కులానికి చెందిన వ్యక్తే. ప్రతి ఒక్కరూ సీఎం అయ్యారని, ఆ అధికారాన్ని అనుభవించారని, కేవలం డీకే శివకుమార్ మాత్రమే సీఎం కాలేదని కుమార చంద్రశేఖరనాథ స్వామి తెలిపారు. అయితే ఒకవేళ సిద్దరామయ్య తన సీఎం పదవిని వదులుకుంటే, అప్పుడు శివకుమార్ సీఎం అవుతారని మఠాధిపతి పేర్కొన్నారు. సిద్దరామయ్య, శివకుమార్ ఒకే స్టేజ్‌పై ఉన్న సమయంలో చంద్రశేఖరనాథ స్వామి ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. డీకే శివకుమార్ సీఎం కావాలని చెన్నగిరి కాంగ్రెస్ ఎమ్మెల్యే బసవరాజు శివగంగ కూడా డిమాండ్ చేశారు. సీఎం సిద్ధరామయ్య దీనిపై రియాక్ట్ అవుతూ.. కాంగ్రెస్ హైకమాండ్ ఈ అంశాన్ని చూసుకుంటుందన్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామని, హైకమాండ్ ఏది నిర్ణయిస్తే అదే చేస్తామన్నారు. మరో వైపు ముగ్గురు డిప్యూటీ సీఎంలు ఉండాలని కర్నాటకలో కొన్ని వాదనలు వినిపిస్తున్నాయి. మంత్రులు అందరూ దీనిపై మాట్లాడడం ఆపేయాలని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. ఇలాంటి టాపిక్‌పై ప్రకటనలు చేయవద్దు అని మంత్రి కేఎన్ రాజన్నకు సీఎం సిద్దరామయ్య ఫోన్ చేసి వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం శివకుమార్ ఒక్కరే డిప్యూటీ సీఎంగా ఉన్నారు. కానీ వీరశైవ లింగాయత్‌లు, ఎస్సీ-ఎస్టీలు, మైనార్టీలకు కూడా డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని మంత్రి రాజన్న డిమాండ్ చేశారు. ముగ్గురు డిప్యూటీ సీఎంలు ఉండాలని మీడియాతో మాట్లాడడం సరికాదు అని, కావాలనుకుంటే ఆ నేతలు నేరుగా వెళ్లి హైకమాండ్‌తో చర్చించుకోవచ్చు అని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు.

# మాజీ మంత్రి విజయభాస్కర్ పరార్.. విషయం ఏంటంటే...



చెన్నై: భూకబ్జా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్‌ను అరెస్టు చేసేందుకు సీబీసీఐడీ అధికారులు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన అజ్ఞాతంలోకి జారుకున్నట్లు తెలిసింది. దీంతో విజయభాస్కర్ కోసం సీబీసీఐడీ అధికారులు గాలిస్తున్నారు. కరూర్ జిల్లా వాంగల్ కుచ్చిపాళయం ప్రాంతానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి స్థానిక అన్నాడీఎంకే నాయకుడు. ఈయన ఒక ఎలక్ట్రానిక్ దుకాణం నడుపుతుండగా అతడితో మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్‌కు లావాదేవీలుండేవి. ఈ విషయంలో వారిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ప్రకాష్?కు చెందిన రూ.100 కోట్ల విలువైన భూమిని బలవంతంగా తన పేరుమీద మాజీ మంత్రి రాయించుకున్నట్టు ఆరోపణలున్నాయి. దీనిపై ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరూర్ నగర పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే, ఈ కేసును సీబీసీఐడీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అదేసమయంలో ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ విజయభాస్కర్ పెట్టుకున్న పిటిషన్‌పై విచారణ జరిపిన కరూర్ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ కోర్టు పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో విజయభాస్కర్‌ను అరెస్టు చేసేందుకు సీబీసీఐడీ అధికారులు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది.


# 'అసదుద్దీన్ ఒవైసీ'పై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి లేఖ

**ముంబై :** ఎంపీగా ప్రమాణం చేస్తూ జై పాలస్తీన అంటూ వ్యాఖ్యలు చేసిన ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అమరావతి మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు నవనీత్ రాణా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్రపతికి నవనీత్ రాణా గురువారం లేఖ రాశారు. ఒవైసీ తన ప్రమాణం స్వీకార కార్యక్రమంలో 'జై పాలస్తీనా' నినాదాన్ని లేవనెత్తడం ద్వారా భారత్‌కు బదులుగా మరో దేశానికి విధేయతను వ్యక్తం చేశారని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. అయితే తన డిమాండ్‌కు మద్దతుగా రాజ్యాంగంలోని 102, 103 ప్రకరణలను ఈ సందర్భంగా ఆమె ఉదాహరించారు. ఈ ప్రకరణలు ఒవైసీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడానికి ఉపకరిస్తాయని ఆమె స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీలు.. జూన్



25వ తేదీన ప్రమాణం చేశారు. ఈ ప్రమాణంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.. జై బీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై సభలోని పలువురు కేంద్ర మంత్రులతోపాటు వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు సైతం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో ప్రొటెం స్పీకర్ స్థానంలో ఉన్న రాధా మోహన్ సింగ్ స్పందించారు. ఒవైసీ చేసిన వ్యాఖ్యలను పరిశీలించి రికార్డుల నుంచి తొలగిస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మరోవైపు ఎంపీ ఒవైసీ వ్యాఖ్యలపై గోవాలోని హిందు నాయకులు నుంచి నిరసనలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఆ క్రమంలో ఒవైసీపై తక్షణమే అనర్హత వేటు వేయాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు. అందులోభాగంగా దక్షిణ గోవాలోని పొండా తాలుకలో జరిగిన 12వ విష్వక్ హిందూ రాష్ట్ర మహోత్సవంలో.. ఒవైసీనపై అనర్హత వేటు వేయాలని తీర్మానం కూడా చేశారు. 102 డి ప్రకరణ ప్రకారం అసదుద్దీన్ ఒవైసీపై అనర్హత వేటు వేయవచ్చని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఈ నెల 29 నుంచి అమర్‌నాథ్ యాత్ర.. జమ్మూల్లో టోకెన్ల జారీ..



అమర్‌నాథ్ యాత్ర ఈ నెల 29న మొదలవనున్నది. యాత్రకు ముందురోజు అంటే శు క్రవారం మొదటి బ్యాచ్ బేస్ క్యాంప్ భగవతినగర్ జమ్మూ నుంచి బల్తాల్, పహల్గామ్ బయలుదేరి వెళ్లనున్నాయి. ఈ క్రమంలో బుధవారం జమ్మూలోని సరస్వతి ధామ్‌లో ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్ కోసం టోకెన్ల జారీ మొదలైంది. తొలిరోజు బల్తాల్, పహల్గాం నుంచి వెళ్లేందుకు సుమారు 1000 టోకెన్లు జారీ చేశారు. యాత్రికులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు జనం భారీగా తరలివచారు. సరస్వతి ధామ్‌కు తెల్లవారుజామున 4 గంటల నుంచి యాత్రికులు చేరుకొని.. క్యూలైన్లలో బారులు తీరారు. బంగ్లాదేశ్ నుంచి సైతం నలుగురు భక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని జమ్మూకు చేరుకున్నారు. భద్రతలో ఎలాంటి లోపం లేకుండా చూసేందుకు భద్రతా బలగాలు మార్క్ డ్రిల్ నిర్వహించి, ఏర్పాట్లను పరిశీలించాయి. ఇటీవల ప్రయాణికుల వాహనంపై ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భద్రతా బలగాలను భారీగా మోహరించారు. డ్రోన్లు, 365 డిగ్రీస్ యాంగిల్ సీసీ కెమెరాల సాయంతో వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. జమ్మూ-శ్రీనగర్ హైవేపై ప్రతి 500 మీటర్లు, కిలోమీటరుకు సెక్యూరిటీ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ 24 గంటలూ సాయుధ సైనికులను మోహరించి తనిఖీలు చేయనున్నారు. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే వారంతా సాయంత్రం 7గంటల్లోగా భగవతినగర్‌లోని బేస్ క్యాంప్‌లోకి ప్రవేశించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. యాత్ర కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారంతా ఇప్పటికే జమ్మూకు తరలివస్తున్నారు. యాత్రికుల కోసం తక్షణ రిజిస్ట్రేషన్ గురువారం ఉదయం వైష్ణవి ధామ్, పంచాయతీ భవన్, రైల్వే స్టేషన్ సమీపంలోని మహాజన్ హాల్.. అలాగే, పురాణి మండిలోని శ్రీరామ దేవాలయం, గీతా భవన్ (సాధుల కోసం) వద్ద మొదలవనున్నది.

# రష్యాలో పట్టాలు తప్పిన రైలు..

రష్యాలో ఓ రైలు పట్టాలు తప్పడంతో అందులో ప్రయాణిస్తున్న 70 మందికి పైగా గాయపడ్డారు. బుధవారం నార్తరన్ కోమి రీజియన్ లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రైలు పట్టాలు తప్పడంతో తొమ్మిది బోగీలు కోమి నదిలో పడిపోయాయి. నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు వెల్లడించారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే స్పందించామని, రెస్క్యూ టీమ్ లు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు సాయం చేశాయని కోమి రీజనల్ గవర్నర్ వ్లాదిమిర్ ఉయ్ బా చెప్పారు. బాధితులలో ముగ్గురి పరిస్థితి సీరియస్ గా ఉందని వైద్యులు చెప్పారన్నారు. ప్రమాదం జరిగిన రైలులో 215 మంది ప్రయాణికులు ఉన్నారని వివరించారు. రెస్క్యూ బృందాలు, ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. తొమ్మిది బోగీలు పట్టాలు తప్పడంతో అందులో ఉన్న 70 మంది గాయపడ్డారు. వారిలో కొందరికి స్వల్ప గాయాలు కాగా మరికొందరికి సీరియస్ గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించి, చికిత్స అందించే ఏర్పాట్లు చేసినట్లు ఉయ్ బా వివరించారు. కోమి రీజియన్ లో ఇటీవలి భారీ వరదలకు రైలు పట్టాలు దెబ్బతిన్నాయని, తాజా ప్రమాదానికి కారణమిదేనని ప్రాథమిక విచారణలో తేలిందని పేర్కొన్నారు. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నదిలో పడిపోయిన బోగీలు, అందులో నుంచి అతికష్టమ్మీద బయటపడుతున్న ప్రయాణికులు ఈ వీడియోలో కనిపిస్తున్నారు.

# ఆసుపత్రి నుంచి ఎల్ కె అద్వానీ డిశార్జ్

**న్యూఢిల్లీ :** తీవ్ర అనారోగ్యంతో ఎయిమ్స్‌లో చేరిన మాజీ ఉప ప్రధాని, భారతరత్న ఎల్ కె అద్వానీ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ నేపథ్యంలో ఆయన్ని గురువారం ఎయిమ్స్ నుంచి వైద్యులు డిశార్జ్ చేశారు. ఆయన ఆరోగ్యంపై మూత్ర గుండె వృద్ధాప్యంకు సంబంధించిన ప్రత్యేక వైద్య బృందం క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించి.. నివేదికలను పరిశీలించింది. అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని సదరు వైద్య బృందం స్పష్టం చేశారు. దీంతో ఆయన్ని డిశార్చ్ చేసినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. 96 ఏళ్ల ఎల్ కె అద్వానీ బుధవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ని అల్ ఇండియా మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో చేర్చిన సంగతి తెలిసిందే. 1927, నవంబర్ 8న కరాచీలో ఎల్ కె అద్వానీ జన్మించారు. 1942లో ఆర్ఎస్ఎస్‌లో స్వయంసేవక్‌గా చేరారు. ఇక 1986-1990, 1993 - 1998 మధ్య ఎల్ కె అద్వానీ బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. 2004 - 2005 మధ్య



వాజపేయ్ ప్రభుత్వంలో ఉప ప్రధానిగా అద్వానీ కొనసాగారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించింది. దీంతో భారత ప్రధానిగా ముచ్చటగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసే 2 రోజుల ముందు అద్వానీ నివాసానికి నరేంద్ర మోదీ వెళ్లారు. ఈ ఏడాదే ఎల్ కె అద్వానీకి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రకటించిన విషయం విధితమే.

# పెన్ పింటర్ ప్రైజ్ గెలుచుకున్న అరుంధతీ రాయ్



**న్యూఢిల్లీ:** ఈ యేటి పెన్ పింటర్ ప్రైజ్ అవార్డును అరుంధతీ రాయ్ గెలుచుకున్నది. నోబెల్ గ్రహీత, రచయిత హరాల్డ్ పింటర్ జ్ఞాపకార్థం పెన్ పింటర్ అవార్డును ఏర్పాటు చేశారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన ఘటనలో రెండు వారాల క్రితమే అరుంధతీ రాయ్‌పై యూఏపీఏ కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. బ్రిటీష్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఈ బహుమతిని అందజేయనున్నారు. అక్టోబర్ 10వ తేదీన అవార్డు సెర్మనీ ఉంటుంది. ఆ కార్యక్రమంలో అరుంధతీ రాయ్ మాట్లాడనున్నారు. బ్రిటన్, ఐర్లాండ్ లేదా కామన్‌వెల్త్ దేశాల్లో ఉంటూ.. సాహితంలో అద్భుత ప్రతిభను ప్రదర్శించే వారికి పెన్ పింటర్ ప్రైజ్ అందజేస్తారు. ఇంగ్లీష్ పెన్ చైర్మెన్ రూథ్ బోర్త్‌విక్, నటుడు ఖలిద్ అబ్దల్లా, రైటర్ రోజర్ రాబిన్‌సన్‌లతో కూడిన జ్యూరీ అరుంధతీ రాయ్‌ని అవార్డు కోసం ఎంపిక చేసింది. గతంలో ఈ అవార్డు గెలుచుకున్న వారిలో మైఖేల్ రోసెన్, మార్గరేట్ అట్‌వుడ్, మలోరి బ్లాక్‌మాన్, సల్మాన్ రష్దీ, టామ్ స్టాపార్డ్, కారల్ ఆన్ డఫీ ఉన్నారు.

# దూకుడు... ప్లస్సా... మైనస్సా

-మొదటిపేజీ తరువాయి

రెండోది పార్టీ రాజకీయానికి సంబంధించినది. పాలనా పరమైన విషయానికి వస్తే.. రాష్ట్ర చిహ్నంలో మార్పు. కేసీఆర్ హయాంలో రూపొందించిన రాష్ట్ర చిహ్నంలో మార్పులు చేపట్టాలని రేవంత్ రెడ్డి తీసుకున్న దూకుడు నిర్ణయంపై తెలంగాణ వ్యాప్తంగా తీవ్రంగా చర్చ సాగింది. కాకతీయ కళాతోరణం, చార్మినార్ వంటివి తొలగిస్తారన్న ప్రచారం జరిగింది. ఇవి రాజకరికపు ఆనవాళ్లు అన్న వ్యాఖ్యలు అధికార పక్షం నుండి వినపడ్డాయి. కాని కాకతీయుల వైభవం, చార్మినార్ సింబల్ అనేది తెలంగాణ చరిత్రతో ముడిపడిన అంశం. వీటిని తొలగిస్తారన్న ప్రచారాన్ని బీఆర్ఎస్ నేతలు చక్కగా వాడుకున్నారు. ప్రజల్లో కూడా కొంత భావోద్వేగం బయపడింది. దీంతో సర్దుకున్న సీఎం రేవంత్ రెడ్డి దీనిపై శాసన సభలో అన్ని పార్టీలతో చర్చించి ఓ నిర్ణయానకి వస్తానని చెప్పి రాష్ట్ర చిహ్నం మార్పును పక్కన పెట్టారు. అంటే ప్రజలను తన ఆలోచన ప్రకారం సిద్ధం చేయకుండా భావోద్వేగమైన అంశాల్లో ఒకే సారి మార్పులు చేపడితే వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుందని రేవంత్ రెడ్డి కొంత ఆలస్యంగా గ్రహించారు. దూకుడుగా నిర్ణయం తీసుకోవాలనుకున్నా... ఇది ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన విషయమని పాక్షికంగా మార్పు నిర్ణయాన్ని పక్కన పెట్టారు. ఇక ఇప్పుడు రాజకీయంగా చూస్తే... జీవన్ రెడ్డి వ్యవహారం రేవంత్ రెడ్డి దూకుడు నిర్ణయానికి మరో ఉదాహరణ. పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో రాజకీయంగా కాంగ్రెస్ తీవ్ర దుస్థితిని ఎదుర్కొన్న విషయం తెలిసిందే. కేసీఆర్ ఆపరేషన్ ఆకర్ష్ కు పెద్ద పెద్ద నేతలే కారెక్కేసారు. కాని కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మాత్రం కేసీఆర్ ఆహ్వానించినా పార్టీలో చేరనని, సున్నితంగా తిరస్కరించారు. ఆ సమయంలో జీవన్ రెడ్డి సీనియర్ లీడర్ గా తనదైన శైలిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన వ్యక్తి. కాంగ్రెస్ పార్టీలోను సీనియర్. అధిష్టానానికి విధేయుడు. సౌమ్యుడు. అంతే కాదు ఎలాంటి మరకలు లేని వ్యక్తిత్వం. అలాంటి లీడర్ కు తెలియకుండా.. తనపై పోటీ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను రేవంత్ గుట్టు చప్పుడు కాకుండ పార్టీలోకి తీసుకురావడం ఇప్పుడు కాంగ్రెస్ లో చర్చాంశనీయంగా మారింది. సాధారణంగా పార్టీలో ఎవరైనా కొత్తగా చేరాలంటే



ఏ జిల్లా నేత అయితే చేరతారో.... ఆ జిల్లా పార్టీ ముఖ్య నేతలతో చర్చిస్తారు. ఆ చేరే నాయకుడి వల్ల రాజకీయంగా జిల్లాలో చూపే ప్రభావాన్ని అంచనా వేస్తారు. స్వంత పార్టీ నేతల ఇబ్బందులపైన చర్చించాకే... కొత్త లీడర్ ను చేర్చుకుంటారు. లేదంటే జిల్లాలో ముఖ్యమైన సీనియర్ లీడర్ తో అయినా చర్చించి నిర్ణయం తీసుకుంటారు. అలాంటిది ఏకపక్షంగా రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ ను పార్టీలోకి తీసుకోవడం ఓ దూకుడు నిర్ణయంగానే చెప్పాలి. ఈ నిర్ణయంతో కినుక వహించిన జీవన్ రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. తనకు తెలియకుండా సంజయ్ కుమార్ ను ఎలా పార్టీలో చేర్చుకుంటారని అసమ్మతి గళం విప్పారు. దీంతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఆయనతో చర్చించి శాంతింపజేసే ప్రయత్నం చేశారు. అయితే ముఖ్యమంత్రి ఢిల్లీలో ఉండటం వల్ల జీవన్ రెడ్డి రాజీనామా చేసే విషయంలో వేచి చూసే ధోరణితో ఉన్నారు.. పార్టీ లైన్ ఇది కాదని సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా జీవన్ రెడ్డి కొంత ధిక్కార స్వరం వినిపించడం జరిగింది. ఈ వ్యవహారం టీ కప్పులో తుపానుగా ఉంటుందా.. లేక రాజకీయ తుపానుగా రానున్న రోజుల్లో దారి తీస్తుందా వేచి చూడాలి. ఎందుకంటే.. ఎన్నికల ముందు కాంగ్రెస్ లోచాలా మంది సీఎం సీటు ఆశించిన వారే. ఈ తరహా దూకుడు అలాంటి కొంత మంది అసంతృప్త నేతలకు అస్త్రంగా మారే ప్రమాదం లేకపోలేదు. సీఎం సీటుకు తనతో పాటు పోటీ పడిన నేతలతో పోల్చితే.. రేవంత్ రెడ్డి దూకుడు రాజకీయాలతోనే తెలంగాణలో కాంగ్రెస్ ను గెలిపించారనడంలో సందేహం లేదు. ఆ కారణంగానే సీనియర్లు కాదని, మంత్రి పదవి చేపట్టని రేవంత్ రెడ్డిని ఏకంగా కాంగ్రెస్ అధిష్టానం సీఎం కుర్చీలో కూర్చోబెట్టారు. ఇప్పుడు అదే దూకుడు తనకు మేలు చేస్తుందా.. లేదా రాజకీయంగా కీడు చేస్తుందా అన్నది మాత్రం రానున్న రోజుల్లో అర్థం అవుతుంది. జాతీయ పార్టీల కోణం నుండి చూస్తే... స్టీరింగ్ మన చేతిలో ఉన్నా... అధిష్టానం డైరెక్షన్ లోనే బండి నడపాల్సి ఉంటుంది. ఇది రేవంత్ రెడ్డికి తెలియనిదేమి కాదు. కాని ఏదైనా నిర్ణయం తీసుకున్న తర్వాతే దాని ఫలితాలే... మన పని తీరుకు గీటు రాయిగా నిలుస్తాయి. తీసుకున్న నిర్ణయం దూకుడుతనంతో తీసుకున్నాదా... లేదా ఆలోచించి తీసుకున్నాదా అని. చూద్దాం రానున్న రోజుల్లో ఈ దూకుడు మరిన్ని విజయాలను రేవంత్ రెడ్డికి అందిస్తుందా... లేక బ్రేక్ వేస్తుందా అన్నది తేలాలంటే మాత్రం కొంతకాలం వేచి చూడాల్సిందే.

# ముఖ్యమంత్రి కావాలనే నా ఆకాంక్ష నెరవేరింది

**ఢిల్లీ:** టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తవారిని నియమించేందుకు ఏఐసీసీ కసరత్తు చేస్తోందనే ప్రచారం నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన పీసీసీ అధ్యక్ష పదవీకాలం ముగిసిందని అన్నారు. పీసీసీ కొత్త అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా వారితో కలిసి పని చేస్తానని, అధ్యక్షుడి నియామకంపై తనకంటూ ప్రత్యేక ఛాయిస్ ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎవర్ని నియమించినా వారితో కలిసి పనిచేయడమే తన బాధ్యత అని అన్నారు. తాను టీపీసీసీగా ఉన్న కాలంలో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిందని, పార్లమెంటు ఎన్నికల్లో మంచి పనితీరు కనబరిచామని ఆయన ప్రస్తావించారు. అసెంబ్లీ ఎన్నికలకు మించి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటింగ్ శాతం పెరిగిందని పేర్కొన్నారు.

కేసీఆర్‌ను గద్దె దింపాలన్న తన జీవిత లక్ష్యం... అలాగే ముఖ్యమంత్రిని కావాలనే తన ఆకాంక్ష నెరవేరాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇక తన ముందు ఉన్నది తెలంగాణ పునర్నిర్మాణం మాత్రమేనన్నారు. గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. తన పీసీసీ పదవీ కాలం ముగిసిందని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా వారితో కలిసి పని చేస్తానన్నారు. అధ్యక్షుడి నియామకంపై తనకంటూ ప్రత్యేక ఛాయిస్ ఏమీ లేదని వెల్లడించారు.

తన పదవీ కాలంలోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మంచి పనితీరును కనబరిచామన్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటింగ్ శాతం పెరిగిందని గుర్తు చేశారు. తెలంగాణలో కేసీఆర్ పూర్తిగా చేతులెత్తేశారని... అందుకే బీజేపీ బలం పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ పూర్తిగా ధ్వంసమైందని విమర్శించారు.

బీఆర్ఎస్‌కు డిపాజిట్లు వచ్చిన చోట తాము గెలిచామని, బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయిన చోట బీజేపీ గెలిచిందన్నారు. తాను కక్షపూరిత రాజకీయాలకు పాల్పడబోనని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీని లోక్ సభలో జీరో చేశామని... ఆ పార్టీని సున్నా చేయాలన్న తన కోరిక నెరవేరిందన్నారు.

ఇక కేసీఆర్ పూర్తిగా చేతులెత్తేయడం వల్లే బీజేపీకి లాభం జరిగిందని పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లు వచ్చిన చోట తాము గెలిచామని, బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయిన చోట బీజేపీ గెలిచిందని అన్నారు. ఢిల్లీ మీడియాతో ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్ చేశారు.

**కక్షపూరిత రాజకీయాలకు పాల్పడబోను**

తాను కక్షపూరిత రాజకీయాలకు పాల్పడబోనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేసీఆర్‌కు గద్దె దింపాలన్న తన జీవిత లక్ష్యం నెరవేరిందని అన్నారు. " ముఖ్యమంత్రిగా నా రెండో కల నెరవేరింది. బీఆర్ఎస్‌ను లోక్‌సభభలో జీరో చేశాను. ఆ పార్టీని సున్నా చేయాలన్న కోరిక కూడా నెరవేరింది. తెలంగాణను పునర్నిర్మించడమే ఇప్పుడు నా ముందున్న ఏకైక లక్ష్యం. కేసీఆర్ పాలనలో తెలంగాణ పూర్తిగా ధ్వంసం అయింది" అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు

**శ్రీధర్‌బాబు చొరవతో**
**సమస్య పరిష్కారమైందని కితాబు**

కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎట్టకేలకు పెదవి విప్పారు. డాక్టర్ సంజయ్‌కుమార్‌ను పార్టీలో చేర్చున్న తర్వాత జరిగిన పరిణామాలు, జీవన్‌రెడ్డి అలక వంటి విషయాలపై మీడియా



సమావేశంలో మాట్లాడారు.

ఈ విషయంలో జీవన్‌రెడ్డి మనస్తాపానికి గురైన విషయం వాస్తవమేనని, తమవైపు నుంచి ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని రేవంత్ చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించారని తెలిపారు. జీవన్‌రెడ్డి అనుభవం, పార్టీపై ఆయనకున్న కమిట్‌మెంట్‌ను గుర్తించిన అధిష్ఠానం, ఆయన గౌరవానికి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందని చెప్పారు. జీవన్‌రెడ్డ తన అనుభవాన్ని ఉపయోగించి ఇకపై రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తారని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి విషయంలో గోతికాడి నక్కలు కొన్ని ప్రభుత్వానికి, పార్టీకి ఏదైనా జరిగితే బాగుండునని ఎదురుచూశాయని విమర్శించారు. ఒంటె పెదాలకు నక్కలు ఆశపడినట్టు గుంటనక్కలు పాపం బాగా ఎదురుచూశాయని ఎద్దేవా చేశారు. అయితే, జీవన్‌రెడ్డి వారికి అవకాశం ఇవ్వలేదని చెప్పారు. జీవన్‌రెడ్డి, ఆయన అనుచరులు, కార్యకర్తలు, సహచరులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**ఫాంహౌస్‌లో పడుకోవడానికి నేను కేసీఆర్‌ను కాను**

మంత్రి పదవుల విస్తరణ, కొన్ని శాఖలకు మంత్రులు లేరన్న విలేకరుల ప్రశ్నకు రేవంత్ బదులిస్తూ.. ఏ శాఖా ఖాళీగా లేదన్నారు. విద్యాశాఖకు తానే ఫుల్‌టైం మినిస్టర్‌నని చెప్పుకొచ్చారు. ఫాంహౌస్‌లో పడుకుని పాలించేందుకు తాను కేసీఆర్‌ను కానని ఎద్దేవా చేశారు. రాజకీయ పార్టీలు నిర్వహించే పేపర్లు, టీవీ చానళ్లు వారి ప్రయోజనాల కోసం తప్పుడు వార్తలు రాస్తాయని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు.

**నెల రోజులపాటు మంత్రులే లేకున్నా ఎవరూ ప్రశ్నించలేదు**

కేసీఆర 2019లో ముఖ్యమంత్రి అయ్యాక నెల రోజులపాటు రాష్ట్రానికి మంత్రులే లేరని, ఆ రోజు ఎందుకిలా? అని ఒక్కరు కూడా మాట్లాడలేదని గుర్తు చేశారు. రాజకీయ పార్టీల పేపర్లు, టీవీ చానళ్లలో పడి ఎవరూ కొట్టుకుపోవద్దని, రాష్ట్ర పాలనను, శాఖలను ఇతర రాష్ట్రాలో పోల్చి చూసి చెప్పాలని కోరారు.

**మాలాగా ఎవరన్నా కలిశారా?**

తాము అధికారం చేపట్టాక కేంద్రంలోని మంత్రులను కలిసినట్టు ఏ రాష్ట్రం వారైనా కలిశారా? కనీసం బీజేపీ పాలిత రాష్ట్రాల మంత్రులు, సీఎంలు అయినా కలిశారా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఎక్కినమెట్టు ఎక్కకుండా కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని వివరించారు. ఏకకాలంలో రూ. 31 వేల కోట్ల రుణమాఫీకి నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు.

**బీఆర్ఎస్ కూడా ఫిర్యాదు చేయలేకపోయింది**

తాము అధికారంలోకి వచ్చాక జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో చిన్న ఘటన కూడా జరగలేదని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. అదే పొరుగు రాష్ట్రం ఏపీలో ఎన్నికల తర్వాత 40, 50 మంది అధికారులను తొలగించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. చివరికు బీఆర్ఎస్ కూడా తమపై ఫిర్యాదు చేయలేకపోయిందని పేర్కొన్నారు. పాలనను సమర్థంగా నిర్వహించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక అన్ని మతాల పండుగలు బ్రహ్మాండంగా జరిగాయని, మతపరమైన ఘటన ఎక్కడా చిన్నది కూడా జరగలేదని గుర్తు చేశారు. అంతేకాదు, ఒక్క రాజకీయ ప్రేరేపిత కేసు కూడా పెట్టలేదని పేర్కొన్నారు. దీనిని బట్టి పాలన బాగున్నట్టా? బాగా లేనట్టా? అన్నది చెప్పాలని ప్రశ్నించారు.

సిగ్గు వదిలేసిన కేసీఆర్‌కు మతికూడా పోయింది

ఫిరాయింపుల విషయంలో గగ్గోలు పెడుతున్న కేసీఆర్ సిగ్గు వదిలేయడంతోపాటు ఆయనకు మతి కూడా పోయిందని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఫిరాయింపులకు పునాదులు వేసింది ఎవరని ప్రశ్నించారు. 61 మంది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను లాగేసుకున్న కేసీఆర్ ఇప్పుడు వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్టు ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పాపాలకు కేసీఆర్ తెలంగాణ అమరవీరుల స్తూపం వద్దకు వెళ్ల ముక్కు మూడు అంగుళాలు అరిగిపోయేట్టు నేలకు రాయాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వం పడిపోతుందని ప్రచారం చేసింది వీళ్లు కాదా?**

ప్రజలు ఎన్నుకున్న తమ ప్రభుత్వం పడిపోతుందని, వంద రోజులు కూడా ఉండదని ప్రచారం చేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. దీనికి కేటీఆర్, హరీశ్ వంతపాడారని మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం పడిపోతుందని రోడ్లమీదకు వచ్చి రంకెలేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. చేతబడి చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్న వాడిని చూస్తూ కూర్చొంటామా? చెట్టుకు కట్టేసి బడిత పూజ చేయమా? అని ప్రశ్నించారు. 17 లోక్‌సభ సీట్లలోనూ ఓడిపోయి, 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయి, 14 చోట్ల మూడో స్థానంలో నిలిచాక కూడా కేసీఆర్‌కు కనువిప్పు కలగలేదని దుమ్మెత్తి పోశారు. తమకు ఓట్లేయకపోవడం ప్రజల తప్పు అన్నట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో 37.5 శాతం సీట్లు బీఆర్ఎస్‌కు వస్తే లోక్‌సభ ఎన్నికల్లో 16 శాతానికి పడిపోయాయని అన్నారు.

**కేటీఆర్ నియోజకవర్గంలో బీజేపీకి ఫస్ట్ ప్లేస్**

లోక్‌సభ ఎన్నికల్లో కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో ఎక్కడైనా బీజేపీకి ఫస్ట్ ప్లేస్ వస్తుందా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. దీనిని బట్టి కాంగ్రెస్‌ను ఓడించేందుకు ఆ రెండు పార్టీలు ఎంతగా కలిసి పనిచేశాయో అర్థం చేసుకోవచ్చని అన్నారు. సిద్దిపేటలో బీజేపీ, బీఆర్ఎస్‌కు సమానంగా ఓట్లు వచ్చాయని, బీఆర్ఎస్ కంచుకోట మెదక్‌లో ఆ పార్టీకి థర్డ్ ప్లేస్ వచ్చిందని, కాబట్టి కేసీఆర్‌కు ఇకనైనా కనువిప్పు కలిగితే మంచిదని హితవు పలికారు. మొన్నటి వరకు ఎమ్మెల్యేలను గేట్లు కూడా తాకనియ్యని కేసీఆర్.. ఇప్పుడు ఇంటికి పిలిచి భోజనాలు పెట్టే స్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. తలుపులు మూసి కాళ్లు పట్టుకుంటున్నారో, కడుపులో తలకాయ పెడుతున్నారో తనకు తెలియదని సెటైర్ వేశారు.

## సగం మందికే పెట్టుబడి

-మొదటిపేజీ తరువాయి

ఏ పథకమైనా అర్హులకు అందినప్పుడే దాని ఉద్దేశం నెరవేరుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ అందించింది. దీంతో ఈ నిధులు పక్కదారి పట్టాయి. రియల్ ఎస్టేట్ వెంచర్లు, కొండలు, గుట్టలకు కూడా రైతుబంధు సాయం అందింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్ ఈసారి అర్హులకే రైతుబంధు అందించేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తోంది. పూర్త పారదర్శకంగా రైతుభరోసా స్కీమ్ అమలుచేస్తామని తెలిపింది. రైతుభరోసా అందించేందుకు ప్రభుత్వం గ్రామాల వారీగా సాగుభూమి వివరాలు సేకరిస్తోంది. రియల్ ఎస్టేట్ భూములు ఎన్ని ఉన్నాయి.. కొండలు, గుట్టలు ఎన్ని ఉన్నాయి. సాగులో లేని దేవాలయ భూములు, వక్ఫ్ భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయి అనే వివరాలు మూడు రోజుల్లో ఇవ్వాలని వ్యవసాయాధికారులకు సూచించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో ఏటా రూ.10 వేల చొప్పున చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈమేరకు అర్హులను ఎంపిక చేస్తోంది. ఇదే సమయంలో కౌలు రైతులకు కూడా ఏడాదికి రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇస్తామని తెలిపింది. రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని ప్రకటించింది. అయితే ఈ స్కీం ఇంకా అమలు కాలేదు. ప్రస్తుత సీజన్‌లో రైతు భరోసా కింద రైతులకు మాత్రమే సాయం అందించే అవకాశం ఉంది. ఈ క్రమంలో అనర్హులను తొలగించి రైతు భరోసా సాయం అందించేందుకు కసరత్తు చేస్తోంది. రైతు భరోసా కొత్త మార్గదర్శకాల ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులు, ప్రజాప్రతినిధులు, బడా వ్యాపార వేత్తలకు పెట్టుబడి సాయం అందదు. బీడుభూములు, రోడ్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు ఈ పథకం వర్తించదు. దీంతో ప్రభుత్వానికి భారీగా నిధులు మిగులాయని సీఎం భావిస్తున్నారు. ఇక రైతుభరోసాను 5 ఎకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్నవారికి మాత్రమే వర్తింపజేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిని బీఆర్ఎస్ తప్పు పడుతోంది. కానీ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ప్రకారం.. రైతు భరోసా 10 ఎకరాలలోపు వారికే ఇవ్వాలని చాలా మంది రైతులు సూచించారు. ఈ నేపథ్యంలో అధికారికంగా మార్గదర్శకాలను వారం పది రోజుల్లో విడుదల చేసే అవకాశం ఉంది.

## జూలై 4న కేబినెట్ విస్తరణ...

-మొదటిపేజీ తరువాయి

మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. మరో ఆరుగురికి మంత్రివర్గంలో అవకాశం దక్కనుంది. ఈమేరకు అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సమాచారం. దీంతో మంత్రి పదవుల కోసం సీనియర్లు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తెలంగాణలో ఆరు మంత్రి పదవులతోపాటు 37 నామినేటెడ్ పదవుల భర్తీకి కూడా సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందే కొన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేశారు. అయితే వీటిపై కొందరు మంత్రుల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు ఇచ్చే అవకాశం ఉంది. ఒకటి రెండు రోజుల్లో నామినేటెడ్ పదవుల ఎంపిక ప్రక్రియ పూర్తవుతుందని తెలుస్తోంది.

ఇక ఆరు మంత్రి పదవుల్లో రెండు రెడ్డి సామాజిక వర్గానికి, రెండు బీసీలకు, ఒకటి లంబాడీలకు, మరొకటి మైనారిటీలకు ఇస్తారని తెలుస్తోంది. ఆరు పదవుల్లో హోం, విద్య, కార్మిక , మున్సిపల్ కీలకంగా ఉన్నాయి. ఇందులో హోం శాఖను నిజామాబాద్‌కు చెందిన సుదర్శన్‌రెడ్డికి ఇస్తారని సమాచారం. ఇదిలా ఉండగా మంత్రి పదవులు ఆశిస్తున్న పలువురు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఈమేరకు అధిష్టానం ఆశీస్సుల కోసం ప్రయత్నిస్తున్నారు. నలుగురూ రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే కావడం గమనార్హం. ఇందులో ఇద్దరికి మంత్రి పదవులు, ఒకరికి డిప్యూటీ స్పీకర్ పదవి, మరోకరికి ప్రభుత్వ చీఫ్ విప్ పదవి వరించే అవకాశం ఉంది. మంత్రి పదవుల ఎంపికలో సామాజికవర్గాల సమీకరణే కీలకం కానుంది. రెడ్డి సామాజికవర్గం నుంచి పోటీ ఎక్కువగా ఉండగా, బీసీలు కూడా ఎక్కువగానే పదవులు ఆశిస్తున్నారు. మరోవైపు వెలమ సామాజిక వర్గం కోటా ఇప్పటికే భర్తీ కాగా, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఆయనకు సామాజికవర్గమే అడ్డుగా మారుతోంది.

## ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది..

**హైదరాబాద్ :** తెలంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యాన్ని సాధించిన.. అంతటి ఉదాత్తమైన లక్ష్యం కోసం ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది. తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు అని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పునరుద్ఘటించారు. తనను కలిసేందుకు ఎర్రవెల్లి నివాసానికి వందలాదిగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. "తెలంగాణ సాధించేనాటికి మనది సమైక్యపాలనలో దిక్కు మొక్కు లేని పరిస్థితి. సాగునీరు తాగునీరు కరెంటు వంటి అనేక కీలక వసతులను కల్పించుకున్నాం. తీర్చిదిద్దుకున్నాం. పదేండ్ల అనతికాలంలోనే తెలంగాణలో అద్భుతమైన ప్రగతిని సాధించుకున్నాం. ఇటువంటి కీలక సమయంలో వచ్చిన ఎన్నికల్లో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. కొన్ని కొన్ని సార్లు ఇట్లాంటి తమాషాలు జరుగుతుంటాయని చరిత్రలోకి వెళితే అర్థమౌద్ది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు అనూహ్యంగా మోసపోయారు. "పాలిచ్చే బర్రెను వొదిలి దున్నపోతును తెచ్చుకున్నట్టు అయింది" అని పల్లెల్లో ప్రజలు బాధపడుతున్నారు" అని కేసీఆర్ వివరించారు.

**తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో దారి తప్పింది..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన అనేక పథకాలు తమకు అందట్లేవని ప్రజలు ఆందోళన చెందుతున్నారని కేసీఆర్ అన్నారు. సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, రైతు బంధు అందట్లేవన్నారు. తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా సరిగా లేదన్నారు. ఇవన్నీ ప్రజల మనసుల్లో రికార్డ్ అవుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కష్టపడి దరికి తెచ్చిన తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో దారి తప్పిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఎటువంటి ఆందోళన చెందవద్దని కార్యకర్తలకు కేసీఆర్ భరోసా ఇచ్చారు.

**బీఆర్ఎస్‌ను గద్దె మీద కూర్చుండ బెట్టే రోజు త్వరలోనే వస్తుంది..**

తెలంగాణ కోసం సాగిన మన 25 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణం ఆగలేదు, అయిపోలేదు. నాడు ఎన్టీఆర్‌ని తిరిగి ఎట్లైతే ప్రజలు గద్దె మీద కూర్చోబెట్టారో అంతకన్నా గొప్పగా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు తిరిగి ఆదరిస్తారని.. అంతకంటే రెట్టింపు మద్దతుతో మనలను గద్దె మీద కూర్చుండ బెట్టే రోజు త్వరలోనే వస్తుందని కార్యకర్తల హర్షధ్వానాల నడుమ అధినేత ప్రకటించారు.

**బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలు**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రోజు రోజుకు దిగజారుతున్నదన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నిచ్చెన మెట్లు ఎక్కేది పోయి మొదటి దశలోనే మెట్లు దిగ జారుకుంటూ వస్తున్నదని విశ్లేశించారు. పార్టీ అనేది నాయకులను సృష్టిస్తదని, నాయకులు పార్టీలోకి వచ్చి పోతుంటారని కొంతమంది నాయకులు పార్టీని వీడినంత మాత్రాన పార్టీకి ఎటువంటి తేడా రాదని కేసీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలున్నారని, వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందామని సందర్శకుల చప్పట్లు నడుమ ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ బీ ఫాం ఇచ్చి అవకాశమిస్తే ఎవరైనా సిపాయీలుగా తయారౌతారని కేసీఆర్ తెలిపారు. ప్రజల్లో చైతన్యం వచ్చి తమకు కాంగ్రెస్ ద్వారా జరిగిన మోసాన్ని గుర్తించి తిరిగి బీఆర్ఎస్‌ను ఆదరిస్తారని అప్పటిదాకా ఓపికతో ప్రజా సమస్యలపైన దృష్టి సారించాలని, పట్టుదలతో ప్రజల నడుమనే జీవించాలని కార్యకర్తలకు అధినేత పిలునిచ్చారు. గురువారం ఆర్మూర్, హుజూరాబాద్ నియోజక వర్గాలకు చెందిన నేతలు కార్యకర్తలు వందలాదిగా ఎర్రవెల్లి లోని కేసీఆర్ నివాసానికి తరలివచ్చారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రతీ ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారితో కేసీఆర్ ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు జహంగీర్, దుండిగల రాజేందర్, చైర్మన్లు, సర్పంచులు, తదితర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# నూతన చట్టాలపై అవగాహన అవసరం

**రామగుండం :** కమిషనరేట్ పోలీసులకు ముగిసిన నెల రోజుల శిక్షణా తరగతులు. దేశంలోని నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రామగుండము పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఐజి, అన్నారు. భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్, నాగరిక్ సురక్ష సంహిత బి ఎన్ ఎస్ ఎస్, సాక్ష్య అధినియం, 2023 పై పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి నెల రోజులపాటు నిర్వహించిన శిక్షణా తరగతులు ముగిశాయి. అడిషనల్ డిసిపి రాజు అధ్వర్యంలో కమిషనరేట్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి రామగుండము పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఐజి హాజరై అధికారులు, సిబ్బంది తో మాట్లాడారు. జూలై ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్ చట్టాలు అమలులోకి వస్తున్నాయని అన్నారు. ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బందికి కొత్త చట్టాలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో నెల రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించామని తెలిపారు. కొత్త చట్టాలు అమలు జరిగిన వెంటనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుగా



ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది కొత్త చట్టాలను నేర్చుకొని అవగాహన పెంచుకో వాలని సూచించారు. కమిషనరేట్ వ్యాప్తంగా నూతన చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణా తరగతుల ను నిర్వహించి, శిక్షణా తరగతుల నిర్వహణలో ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేసిన అధికారులను అభినందించారు. నెల రోజులపాటు సమయపాలన పాటిస్తూ అందరికీ అర్థమయ్యేలా తరగతులు బోధించిన ఎసిపి మల్లారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐ లు రాజేష్, వినీత, సంతోష్, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ పి.వంశీకృష్ణ, బి శ్రీనివాస్, కే రాము, ఏ సంతోష్, కే శ్రీనివాస్, కానిస్టేబుల్ కే తిరుపతి, ఎన్. శ్రీనివాస్ లను సిపి ప్రశంస పత్రాలు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, టాస్క్ ఫోర్స్ ఏసిపి మల్లారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐ లు రాజేష్, వినీత, తదితరులు పాల్గొన్నారు

# స్క్రాప్ దుకాణానికి చేరిన పాఠ్యపుస్తకాలు

**గిరిజన సంక్షేమ శాఖ అధికారుల నిర్వాకం**

**నాగర్ కర్నూలు :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల చేతిలో ఉండాల్సిన పాఠ్యపుస్తకాలు చెత్తకుప్పకు చేరాయి.... ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 45 కట్టల పుస్తకాలు కనీసం సీల్ కూడా తీయనివి ఆరు నుంచి పదవ తరగతి వరకు కలిగిన ఇంగ్లీష్ పుస్తకాలు స్క్రాప్ కు చేర్చిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో సంచలనం రేపింది.... ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అందాల్సిన పాఠ్యపుస్తకాలు అచ్చంపేట పట్టణ కేంద్రంలోని స్క్రాప్ దుకాణానికి చేర్చారు... గత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు చెందిన ఇంగ్లీష్ పుస్తకాలు మారుమూల గిరిజన ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సకాలంలో అందజేయకుండా వాటిని నిలువ చేసి డబ్బులకు కక్కుర్తి పడి వాటిని స్క్రాప్ కింద విక్రయించేందుకు యత్నించిన సంబంధిత గిరిజన సంక్షేమ శాఖ అధికారుల బాగోతాన్ని స్థానికులు బయటపెట్టారు. నిన్న రాత్రి పట్టణంలోని ఓ చెత్త కాగితాలు విక్రయించే డంపింగ్ దుకాణంలో అచ్చంపేట నియోజకవర్గం లోని గిరిజన సంక్షేమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పాఠ్యపుస్తకాలను వారికి పంపిణీ చేయకుండా సంబంధిత



అధికారులు వాటిని బహిరంగ మార్కెట్లో స్క్రాప్ కింద విక్రయించి డబ్బులు చేసుకునేందుకు కక్కుర్తి పడి విక్రయిస్తున్న సంగతి బహిరంగపరిచారు. వాటిని బహిరంగ మార్కెట్లో విక్రయించడం ఏమిటని వారు సంబంధిత అచ్చంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాఠ్యపుస్తకాలను ఆటోలో పోలీస్ స్టేషన్ కు తరలించారు. పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందకుండా చేసిన సంబంధిత గిరిజన సంక్షేమ శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అచ్చంపేట నియోజకవర్గం లోని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు....

## సీత రామ మోటార్ల ట్రైల్ రన్ సక్సెస్

**14000 కోట్ల తో ప్రాజెక్టు నిర్మాణం**

**పది లక్షల ఎకరాలకు సాగు నీరు**

**ఈ ఏడాది వైరా ప్రాజెక్టు వరకు నీళ్లు**

ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లా సస్యశ్యామల చేసేందుకు ఉద్దేశించిన సీతారామ ప్రాజెక్టు మోటార్ల ట్రైయిల్ రన్ గటగా రాత్రి సక్సెస్ అయింది. గత వారం రోజుల నుంచి సీతారామ ప్రాజెక్టు మోటార్లని రన్ చేయడానికి అధికారులు చేస్తున్న ప్రయత్నం కొలిక్కి వచ్చింది .సీతారామ ప్రాజెక్టు సక్సెస్ అయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. 17 వేల కోట్ల రూపాయలు అంచనా తో పది లక్షల ఎకరాలకి సాగునీటిని అందించేందుకు కోసం సీతారామ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు గత ప్రభుత్వ హయాంలో చేపట్టారు .ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఆటుపోటులను ఎదుర్కొంది. గత ప్రభుత్వంలో ఏడు వేల కోట్ల రూపాయలని సీతారామ ప్రాజెక్టు కోసం వ్యయం చేశారు. అయితే ఇప్పటికే కొన్ని చోట్ల భూసేకరణ సమస్యగా ఉంది .ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం కూడా మోటార్లు సిద్ధం అయినప్పటికీ ఇంకా కాలువలు నిర్మాణం పూర్తి కాలేదు. అయితే కొంతమేరకు కాలువల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ఏనుకూర్ నుంచి వైరా వరకు మరో కాలువని 90 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపడుతున్నారు . ఈ కాలువ నిర్మాణం ఆగస్టు నెలకి పూర్తి అవుతుంది. ఇది పూర్తి అయితే గోదావరి నుంచి సీతారామ ఎత్తి పోతల పథకం ద్వారా సాగునీటిని మోటార్ల ద్వారా తీసుకొని వైరా వరకు సాగునీరు వస్తుంది. వైరా రిజర్వాయర్ నుంచి నాగర్జున సాగర్ కాలువల ద్వారా సత్తుపల్లి వరకు సాగునీటిని అందించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీతారామ ప్రాజెక్టు పై ప్రత్యేక దృష్టి సారించి మంత్రి అయిన దగ్గర నుంచి నిరంతరం సీతారామ ప్రాజెక్టు కోసం నిర్మాణం కోసం పూర్తి చేసేందుకు అధికారులు వెంట పడటం జరిగింది. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు సంబంధించి మోటార్ల ట్రైలరింగ్ గత రాత్రి అశ్వాపురం మండలం పీజీ కొత్తూరు వద్ద సక్సెస్ అయింది. ముందుగా ప్రాజెక్టు నిర్మాణాన్ని 13 వేల కోట్ల కి టెండర్లు పిలిచినప్పటికీ ఆ తర్వాత నిర్మాణ వ్యయం పెరగడంతో మొత్తం 17 వేల కోట్లకి పెరిగింది ఖమ్మం జిల్లాలో 4 లక్షల ఎకరాలకు భద్రాద్రి జిల్లాలో మూడు లక్షల ఎకరాలకి మహబూబాద్ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకి సాగునీరు అందనుంది

# 105 శాతం పెరిగిన మెట్రో ఆదాయం

**హైదరాబాద్ :** నిత్యం అనేక వేల మంది ప్రయాణికులను గమ్యానికి చేరుస్తూ అందరి ప్రశంసలు అందుకుంటోంది హైదరాబాద్ మెట్రో.తొలినాళ్లలో కాస్త ఒడిదుడుకులు ఎదుర్కొన్నా ప్రస్తుతం లాభాల బాటలో పయనిస్తూ మరో పక్క ప్రయాణికుల అవసరాలు తీరుస్తూ దూసుకుపోతోంది. అయితే హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఆదాయం ఏకంగా 105 శాతం పెరిగిందని నిర్వహణ సంస్థ ఎల్ అండ్ టీ మెట్రో వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1407-81 కోట్ల రాబడి వస్తే గత ఆర్థిక సంవత్సరానికి రూ.703.20 కోట్లు మాత్రమే వచ్చింది.గడిచిన ఆరేళ్లుగా హైదరాబాద్ సిటీలో మైట్రో రైళ్ల వ్యవస్థను నడుపుతున్నారు. కోవిడ్ సమయంలో మెట్రో భారీగా నష్టాలను చవిచూసింది. 2022 మార్చి 31 నాటికి రూ.4108.37 కోట్లు ఉండగా 2023 కు వచ్చేసరికి రూ. 5424.37 కోట్లకు చేరుకుంది. ఇక ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.5979.36 కోట్లకు చేరుకుందని ఎల్ అండ్ టీ వెల్లడించింది.ఎండల ప్రభావం ఒక్కటేకాదు..సమయం కలిసి వస్తుందనుకునే వారి సంఖ్య పెరగడంతో మెట్రోకు ఆదరణ తగ్గడం లేదు. సోమవారం ఉదయం రోజువారీ కంటే ముందే సేవలు ప్రారంభిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు సేవలను పొడిగించారు. గత రెండు నెలలలో చూస్తే



1,23,95,205 మంది మెట్రోలో ప్రయాణించారు. అంటే రోజువారి సగటున చూస్తే 4.13 లక్షల మంది ప్రయాణించారు. మే నెలలో 1,31,05,805 మంది ప్రయాణించారు. రోజువారి సగటున 4.22 లక్షల మంది ప్రయాణించారు. రద్దీకి తగినట్టు లేక?: ప్రయాణికుల సంఖ్య 6 లక్షల మందికి పెరగాల్సి ఉందని మెట్రో వర్గాలు అంటుంటే?ఉదయం, సాయంత్రం కార్యాలయాల వేళల్లో విపరీతంగా రద్దీ ఉంటోందని దానికి సరిపడా మెట్రోలు లేవని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

# స్వర్ణగిరి కి ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

**హైదరాబాద్ :** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇటీవలే ప్రారంభమైన స్వర్ణగిరి ఆలయానికి గత కొన్ని రోజులుగా భక్తులు పోటెత్తుతున్నారు. యాదగిరిగుట్ట ఆలయానికి వెళ్లే భక్తులంతా ఈ ఆలయాన్ని పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. ఇక వీకెండ్,సెలవు దినాల్లో అయితే విపరీతంగా రద్దీ ఉంటుంది. రాష్ట్ర నలుమూలల నుంచి ఈ ఆలయానికి దర్శనానికి వస్తూ ఉండగా.....హైదరాబాద్ నగరం నుంచి ఎక్కువగా భక్తులు వెళుతున్నారు. ఈ నేపథ్యంలోనే భక్తులకు తెలంగాణ ఆర్టీసీ సంస్థ గుడ్ న్యూస్ తెలిపింది. హైదరాబాద్ నుంచి స్వర్ణగిరి అలాయనికి ప్రత్యేక బస్సులు నడపాలని సంస్థ నిర్ణయం తీసుకుంది. అయితే నేటి నుంచే ఈ ప్రత్యేక సర్వీస్ బస్సులు భక్తులకు అందుబాటులో ఉండనున్నాయి అని గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.జేబీఎస్ బస్ స్టేషన్ నుంచి రెండు ఈ - మెట్రో ఎక్స్ ప్రెస్ నాన్ ఏసి బస్సులను ఆలయానికి నడపనునట్టు అధికారులు తెలిపారు. ఈ బస్సులు ప్రతీ రోజూ ఉదయం 7,8 గంటలకు జేబీఎస్ బస్ స్టేషన్ నుంచి బయల్దేరి స్వర్ణగిరి ఆలయానికి చేరుకుంటాయి. ఇక మధ్యాహ్నం 2:50,3:50 గంటలకు తిరిగి ఆలయాం నుంచి హైదరాబాద్ బయలుదేరుతాయి. ఇక



ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి ఆ ఆలయానికి ప్రతిరోజూ ఉదయం 7:30,8:30,10:30,11:35 గంటలకు అలాగే మధ్యాహ్నం 3:20 గంటలకు, సాయంత్రం 4:20,6:25, 7:25 గంటలకు భక్తులకు అందుబాటులో ఉండనున్నాయి. స్వర్ణగిరి ఆలయం నుంచి జేబియస్ బస్ స్టేషన్ కు మధ్యాహ్నం 12:10,1:10 గంటలకు అలాగే రాత్రి 8,9 గంటలకు బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. ఆలయం నుంచి తిరిగి ఉప్పల్ క్రాస్ రోడ్స్ సాయంత్రం 4:45,5:45 గంటలకు అందుబాటులో ఉండనున్నాయి. ఇక టికెట్ ధరల విషయానికి వస్తే జేబీఎస్ నుంచి వెళ్లే బస్సులో ఒక్కొకరికి టికెట్ ధర రూ.100, ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి వెళ్లే బస్సులో రూ.80 గా అధికారులు నిర్ణయించారు.

## ఉత్తమ పైలట్'గా అవార్డు అందుకున్న మహేష్

**వాస్తవ నేస్తం,బజార్ హత్నూర్:** మండలంలోని చందు నాయక్ తండ గ్రామానికి చెందిన మహేష్ కుమార్ 102 అంబులెన్స్'లో పైలెట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. సక్రమంగా విధులు నిర్వహించినందుకు గాను గురువారం ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మహేష్ ను గ్రామస్తులు అభినందించి తాను అందించిన సేవలను ప్రశంసించారు.




## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుత చర్యలు తీసుకుంటాం: ఎంపీడీవో ఉమాదేవి



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామసభలో పలు సమస్యలను ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఉమాదేవి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె గురువారం వీరభద్ర నగర్ కాలనీనీ సందర్శించి పరిశుభ్రతపై, పలు ఇళ్లల్లో ఉంటున్న ఇతర రాష్ట్రాల కార్మికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ.. కొందరు ఇండ్లు అద్దెకు తీసుకొని అసంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, ఇండ్లు అద్దె తీసుకునే వారి వివరాలు ఇంటి యజమానులు భద్రపరుచుకోవాలి అన్నారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఎ ఎస్సై రాజు, ఎంపిటిసి నాగేందర్ గౌడ్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్లు సద్ది విజయభాస్కర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సురభి కుమార్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.టిఎస్‌ను జెన్కోనే నిర్మించాలని నిరసన



**వాస్తవ నేస్తం,పినపాక:** టీజీ జెన్కో ఆధ్వర్యంలోనే రామగుండంలోని ఆర్.టిఎస్( రామగుండం థర్మల్ స్టేషన్ ) విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాక్ సభ్యులు గురువారం నిరసన తెలిపారు. ఆర్.టిఎస్ ను జెన్కోనే నిర్మించాలని, ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలంటూ ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జాక్ నాయకులు ప్రసంగిస్తూ రామగుండం లో జెన్కో ఆధ్వర్యంలో ఉన్న ఆర్.టిఎస్ జీవన కాలం పూర్తవడంతో ఇటీవలే మూసివేసారని చెబుతూ.. ఆ స్థానం లో నిర్మించబోయే విద్యుత్ కేంద్రాన్ని సింగరేణికి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం చూడడం సరైన చర్య కాదని విమర్శించారు. అక్కడ విద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని సింగరేణి కాకుండాజెన్కో కే అప్పగించాలని డిమాండ్ చేశారు.కొత్త విద్యుత్ కేంద్రాలను నిర్మించే సాంకేతిక పరిజ్ఞానం జెన్కో ఉద్యోగులకు ఉందని గుర్తు చేశారు. జెన్కో ఆధ్వర్యంలో నిర్మిస్తే విద్యుత్ సంస్థ తో పాటు ఉద్యోగులకు లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. ఆర్.టిఎస్ లో నిర్మించ బోయే విద్యుత్తు కేంద్రాన్ని జెన్కోకు అప్పగించే వరకు జాక్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమం అనంతరం చీఫ్ ఇంజనీర్ బిచ్చన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాక్ నాయకులు %బా%.శ్రీనివాస్ రెడ్డి, రాజబాబు, నరేష్, ప్రసాద్, సత్యనారాయణ, కృష్ణ వీరస్వామి, దయాకర్, వెంకట్రామ్, రామచంద్రర్ పాల్గొన్నారు.

## మైనర్ బాలుడిపై అత్యాచారం.. నిందితునికి 20 సం. జైలు శిక్ష

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** మైనర్ బాలుడు పై హత్యాచారం చేసిన నిందితునికి 20 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తున్నట్లు పోక్సో కోర్టు న్యాయమూర్తి శివరాం ప్రసాద్ గురువారం తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే ఆదిలాబాద్ జిల్లా నేరగొండ మండల కేంద్రానికి చెందిన శివరాత్రి మహేష్ అనే వ్యక్తి, తన సమీప బంధువైన ఒక బాలుడిని కిరాణా షాప్ కు వెళ్ళమని తన ఇంటికి తీసుకెళ్లాడు. చాలాసేపైన కూడా బాలుడు రాకపోవడంతో బాలుడి చెల్లె నిందితుడైన శివరాత్రి మహేష్ బాలుడి ఒంటిపైన బట్టలు లేకుండా అచేతన పరిస్థితుల్లో పడి ఉండగా, నేరస్తుడు పారిపోవడంతో పారిపోయాడు. బాలుని తల్లి ఫిర్యాదు మేరకు అప్పట్లో (2021) పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నేరం రుజువు అవ్వడంతో గురువారం పోక్సో కోర్టు న్యాయమూర్తి శివరాం ప్రసాద్ నిందితునికి 20 సంవత్సరాలు జైలు శిక్ష రూపాయలు రూ.10 వేలు జరిమానా విధిస్తున్నట్లు తీర్పును వెలువరించారు.

## ఎస్.హెచ్.జి.ల సహకారంతో జల్‌శక్తి అభియాన్ లక్ష్యాల సాధన

**అమరావతి :** జల్ శక్తి అభియాన్ పథకం అమల్లో స్వయం సహాయక బృందాల భాగస్వామ్యాన్ని విస్తృత స్థాయిలో పెంచడం ద్వారా నిర్ణీత లక్ష్యాలను సకాలంలో సాధించాలని కేబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబ అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలను ఆదేశించారు. భవిష్యత్తులో దేశం ఎదుర్కోబోయే నీటి సంక్షోభానికి పరిష్కారాన్ని కనుగొనే లక్ష్యంతో కన్వర్జెన్స్ మోడ్ లో భూగర్భ జలాలను మెరుగుపర్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గురువారం అన్నిరాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి జల్ శక్తి అభియాన్ పథకం అమలు తీరును సమీక్షించారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com